సాగర్‌ను సందర్శించిన ఐజీ రమేశ్‌రెడ్డి

ఐజీకి స్వాగతం పలుకుతున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

నందికొండ, డిసెంబర్ 27 : నాగార్జునసాగర్‌ను ఐజీ రమేశ్‌రెడ్డి శుక్రవారం కుటుంబ సభ్యులతో సందర్శించారు. సాగర్ డ్యాం, గ్యాలరీ, క్రస్ట్ గేట్లు, జలవిద్యుత్ కేంద్రం, ఎత్తిపోతల, రైట్ బ్యాంక్‌లోని ఏపీఆర్‌జేసీ కళాశాలను ఆయన సందర్శించారు. కృష్ణా నదిలో లాంచీలో జాలీ ట్రిప్పునకు వెళ్లారు. అనంతరం బుద్ధవనంలో జాతకపార్కు, అవకానబుద్ధ, మహాస్తూపం, ధ్యాన మందిరంను చూశారు. అంతకుముందు విజయవిహార్ వద్ద ఐజీకి డీఎస్పీ రాజశేఖర్‌రాజు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణానికి సహకారం

- ఎమ్మెల్యే వేముల వీరేశం

రిటైర్డ్ ఉద్యోగుల భవన నిర్మాణ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, డిసెంబర్ 27 : రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవన నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నకిరేకల్‌లో నిర్వహించిన అఖిల భారత పెన్షనర్స్ దినోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అనంతరం భవన నిర్మాణ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా వీరమల్ల రవీందర్, కోకన్వీనర్‌గా పోతుల వెంకటనారాయణ, చీఫ్ అడ్వైజర్‌గా ముస్కు కృష్ణారెడ్డి, అడ్వైజర్లుగా మిట్ట లక్ష్మారెడ్డి, బాదిని లింగయ్య, ప్రత్యేక ఆహ్వానితులుగా వంటల రామలింగం, కందుల సోమయ్య, కార్యవర్గ సభ్యులుగా కనుకుల భిక్షంరెడ్డి, అంజయ్య, ఎం. రాములు, శివకోటి ఆంజనేయులు ఎన్నికయ్యారు. అనంతరం కమిటీని ప్రమాణస్వీకారం చేసింది. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. దామోదర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జి. వెంకట్‌రెడ్డి, కందాల పాపిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలి

- ఐద్వా జిల్లా కార్యదర్శి ప్రభావతి

ప్రయాణికుల నుంచి సంతకాలు సేకరిస్తున్న ఐద్వా సభ్యులు

నల్లగొండ సిటీ, డిసెంబరు 27 : ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా జిల్లాలోని అన్ని డిపోల్లో ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బస్సుల సంఖ్యను పెంచాలని కోరుతూ శుక్రవారం ఐద్వా ఆధ్వర్యంలో నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం డిపో మేనేజర్ శ్రీనాథ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు లేక పోవడంతో మహిళలు, వృద్ధులు, గర్భవతులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా మునుగోడు నియోజకవర్గంలో పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. ప్రభుత్వం బస్సుల సంఖ్యను పెంచి అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నడిపించాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు అనూరాధ, సరోజ, అరుణకుమారి, సుల్తానా, ఉమారాణి పాల్గొన్నారు.

బస్సులో పోగొట్టుకున్న బ్యాగు తిరిగి అప్పగింత

ప్రయాణికురాలికి బ్యాగును అందిస్తున్న ఆర్టీసీ అధికారులు

మిర్యాలగూడటౌన్, డిసెంబర్ 27: ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలు మర్చిపోయి వెళ్లిన బ్యాగును మిర్యాలగూడ డిపో అధికారులు భద్రపర్చి శుక్రవారం ఆమెకు అందించారు. గురువారం దేవరకొండ నుంచి మిర్యాలగూడకు వస్తున్న ఆర్టీసీ బస్సులో యాదాద్రి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలానికి చెందిన గుత్తా కరుణ ప్రయాణించింది. ఆమె ముసలమ్మచెట్టు వద్ద బస్సు ఎక్కి హాలియాలో బస్సు దిగే క్రమంలో తన బ్యాగును బస్సులోనే మర్చి పోయింది. బస్సు మిర్యాలగూడ డిపోకు చేరుకున్న తర్వాత డ్రైవర్ జి.నారాయణ, కండక్టర్ రజిత సదరు బ్యాగును గుర్తించి డిపో అధికారులకు అప్పగించారు. ఆర్‌హెచ్‌సీ జానకిరాంరెడ్డి సెక్యూరిటీ సమక్షంలో బ్యాగును తెరువగా రూ.16వేల నగదు, అరతులం బంగారం, చీరలు ఉన్నట్లు గుర్తించారు. అందులో ఉన్న బంగారు నగల దుకాణం దారుడి నంబర్ ఉండగా అతడి ద్వారా సదరు మహిళ ఫోన్ నంబర్‌ను సేకరించిన ఆర్టీసీ అధికారులు విషయాన్ని తెలిపారు. శుక్రవారం ప్రయాణికురాలు మిర్యాలగూడ డిపోకు రాగా అధికారులు ఆమె వస్తువులను అప్పగించారు. కార్యక్రమంలో భారతీబాయి, ఎంఎఫ్. యాదగిరి, సూపరింటెండెంట్ యాదగిరి, కార్మికులు, అధికారులు పాల్గొన్నారు.

నేషనల్ హ్యూమన్‌రైట్స్ యాంటీ కరప్షన్ బ్యూరో జాతీయ సంయుక్త కార్యదర్శిగా మధుకర్

మచ్చ మధుకర్

మిర్యాలగూడటౌన్, డిసెంబర్ 27: నేషనల్ హ్యూమన్‌రైట్స్ యాంటీ కరప్షన్, యాంటీ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శిగా మిర్యాలగూడకు చెందిన డాక్టర్ మచ్చ మధుకర్ నియామకమయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో సంస్థ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ జ్యోతిష్యర్‌రెడ్డి నియామకపత్రాన్ని మధుకర్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే అన్నివేళలా సంస్థ అండగా ఉంటుందన్నారు. ఉచిత న్యాయ సలహా, సూచనలకు మిర్యాలగూడ చర్చిరోడ్డులోని అడ్వకేట్ ఫర్ జస్టిస్, ది లీగల్ సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

EDUCATION
★రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. J S అకాడమి (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112
NT-337306

WANTED
★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338986-All

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, (గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777630	చౌటుప్పల్ : 9182777638

ఆందోళన బాటలో పంచాయతీ కార్మికులు

- సమస్యలు పరిష్కరించాలని రెండు రోజుల పాటు టోకెన్ సమ్మె
- తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

మునుగోడు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

నల్లగొండ రూరల్, డిసెంబర్ 27: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు అందించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కార్మికులు ఆందోళన బాట పట్టారు. గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఈ నెల 27, 28 తేదీల్లో టోకెన్ సమ్మెకు పిలుపునిచ్చింది. అందులో భాగంగా శుక్రవారం పంచాయతీ కార్మికులు విధులు బహిష్కరించి మండల పరిషత్ కార్యాలయాల ఎదుట సమ్మె చేపట్టారు. తమకు నెలల తరబడి వేతనాలు రాక అర్థాకలితో అలమటిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు. నల్లగొండ తాసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికులు చేస్తున్న సమ్మెకు కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పాలడుగు నాగార్జున మద్దతు తెలిపి మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులు అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నారని, అది కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉండడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పోలె సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికులను పర్మినెంట్ చేసి రిటైర్మెంట్ బెనిఫిట్‌గా రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. టోకెన్ సమ్మెతో సమస్యలు పరిష్కారం కాకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల కార్యదర్శి బొల్లు రవీందర్, కార్మికులు పాల్గొన్నారు.

- చిట్యాల : గ్రామపంచాయతీ కార్మికులు టోకెన్ సమ్మెను నిర్వహించి, కనకదుర్గ సెంటర్‌లో నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేశ్ వారికి మద్దతు తెలిపారు. పంచాయతీ కార్మికుల సంఘం మండల కార్యదర్శి మహంకాళ బాలమ్మ, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.
- కేతేపల్లి : తాసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేపట్టారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఆదిమళ్ల సుధీర్ మద్ద తు తెలిపారు. సమ్మెలో సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.
- తిప్పర్తి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గామపంచాయతీ కార్మికులు సమ్మె నిర్వహించారు. సీఐటీయూ నాయకులు భీమగాని గణేశ్ మద్దతు తెలిపారు. శ్రామిక మహిళా మండల కన్వీనర్ మంత్రాల మంగమ్మ, గ్రామపంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షుడు కంచర్ల జానయ్య, కార్మికులు పాల్గొన్నారు.
- పెద్దవూర : స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఎస్‌కే.బషీర్, సంఘం నాయకులు మంగారెడ్డి, రామకృష్ణ, మైనుద్దిన్, ప్రభాకర్, అంజిరెడ్డి, లక్ష్మమ్మ పాల్గొన్నారు.
- మునుగోడు : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు టోకెన్ సమ్మెను చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ వరికుప్పుల ముత్యాలు, ప్రధాన కార్యదర్శి ఎర్రగోని లింగయ్య, కార్మికులు పాల్గొన్నారు.

చిట్యాలలో నిరసన తెలుపుతున్న గ్రామపంచాయతీ కార్మికులు

తిప్పర్తిలో సమ్మెలో పాల్గొన్న గ్రామపంచాయతీ కార్మికులు

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళి

మిర్యాలగూడలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, డిసెంబర్ 27: భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు , జిల్లా ప్రజలు సంతాపం వ్యక్తం చేశారు. అన్ని మండల కేంద్రాల్లో మన్మోహన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. మిర్యాలగూడలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ ప్రధానిగా, ఆర్థిక మంత్రిగా ఆయన దేశానికి సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు. నకిరేకల్‌లో మన్మోహన్‌సింగ్ ఫ్లెక్సీకి ఎమ్మెల్యే వేముల వీరేశం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చౌగోని రజితాశ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

నార్కట్‌పల్లి, డిసెంబర్ 27 : అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న జిల్లా వ్యాప్తం గా నిరసన చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒకే దేశం ఒకే ఎన్నిక విధానాన్ని తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం గడిచిపోయినా ఆరు గ్యారెంటీలు మాత్రం అమలు కాలేదన్నారు. అంతకు ముందు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, పార్టీ నాయకులు మెరుగు పెద్దులు మృతికి సంతాపం వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు పార్టీ చెరుకు పెద్దులు, చింతపల్లి బయ్యన్న, కల్లూరి యాదగిరి, కుమ్మరి శంకర్, దండు రవి, కట్ట రామచంద్రం, భగవంతరెడ్డి, ముప్పిడి సత్యం, బొల్లెద్దు సైదులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు

మహేశ్(ఫైల్)

హాలియా, డిసెంబర్ 27 : బైక్‌ను వేగంగా నడిపి ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం హాలియాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సతీశ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అనుముల మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన పుట్టా మహేశ్ (22) బైక్‌పై హాలియాకు వచ్చాడు. పని పూర్తి చేసుకొని హాలియా నుంచి స్వగ్రామానికి బయల్దేరాడు. మార్గమధ్యంలో ఆంజనేయ రైస్‌మిల్లు సమీపంలో అతివేగంగా వెళ్తూ ట్రాక్టర్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన మహేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి వెనుక కూర్చున్న అదే గ్రామానికి చెందిన యువకుడు బాబీకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు బాబీని వైద్యం కోసం నల్లగొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

‘సీపీఐ శతజయంతి సభను విజయవంతం చేయాలి ’



గుండ్రాంపల్లిలో జెండావిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

చిట్యాల, డిసెంబర్ 27 : ఈ నెల 30న నల్లగొండలోని ఎన్‌జీ కాలేజీ గ్రౌండ్‌లో జరిగే సీపీఐ శతజయంతి బహిరంగ సభను జయప్రదం చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో శుక్రవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ గ్రామశాఖ కార్యదర్శి జిల్లా సత్యం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొడిగె సైదులు, కేతరాజు అంజయ్య, బొడిగె బక్కశెట్టి, బొబ్బల శంకర్‌రెడ్డి, దుబ్బ విఘ్నేశ్వర్, సీమ అంజయ్య, రత్నం లింగస్వామి పాల్గొన్నారు.

కేజీబీవీలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

తుంగతుర్తి, డిసెంబర్ 27: మండల కేంద్రంలోని కేజీబీవీలో భౌతికశాస్త్రం, ఇంగ్లీష్ (సీఆర్‌టీ) సబ్జెక్ట్‌లను బోధించేందుకు తాత్కాలిక పద్ధతిలో అధ్యాపకుల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ బోయిని లింగయ్య యాదవ్ శుక్రవారం తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ వాయిదా : డీఈఓ

రామగిరి, డిసెంబర్ 27: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 30, 31తేదీల్లో నల్లగొండలోని డాన్‌బాస్కో హైస్కూల్లో నిర్వహించనున్న జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు డీఈఓ బి.భిక్షపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి చెందగా రాష్ట్ర ప్రభుత్వం వారం రోజులు సంతాప దినాలుగా ప్రకటించిన దృష్ట్యా ప్రదర్శన వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తదుపరి నిర్వహణ తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

త్రిపురారం, డిసెంబర్ 27: పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ వై.ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నీలాయగూడెం గ్రామ శివారులో సాయంత్రం 4గంటల సమయంలో బోగోజు రాంరెడ్డి కొట్టం వద్ద పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న నీలాయగూడేనికి చెందిన గున్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, అంజనపల్లికి చెందిన గ్యార రవి, బెజ్జికల్‌కు చెందిన కంచర్ల నరసింహ, సత్యనారాయణపురానికి చెందిన వెంగుల శ్రీనివాస్‌రావును పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.20,560 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. పేకాట, కోడి పందేలు ఆడుతున్నా, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వారు కనిపిస్తే వివరాలను పోలీలకు గానీ, సెల్ :8712670196 నంబర్‌కు తెలుపాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

చందంపేట(నేరేడుగొమ్ము), డిసెంబర్ 27 : నేరేడుగొమ్ము మండలం కాచరాజుపల్లి గ్రామానికి చెందిన బద్దెల గోవిందు శుక్రవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గోవిందు తన ఇంట్లో ఉన్న బోరును ఆన్ చేసేందుకు యత్నించగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న గోవిందు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే వెంట వడ్త్య బాలు, తులసీరాం, కృష్ణ ఉన్నారు.

యూటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి : మధు

గుర్రంపోడు, డిసెంబర్ 27: ఈ నెల 28 నుంచి 30 వరకు జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 6వ విద్యా వైజ్ఞానిక మహాసభల విజయవంతం చేయాలని సంఘం మండలాధ్యక్షుడు కొదాటి మధుసూదన్ కోరారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ మహాసభల్లో ప్రభుత్వ విద్య బలోపేతంతో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంఈఓ నోముల యాదగిరి, సంఘం సభ్యులు బాలెం పాండరయ్య, గెజిటెడ్ హెచ్‌ఎం మంగ్లానాయక్, మండల ప్రధాన కార్యదర్శి బి. సైదులు, ఉపాధ్యక్షుడు యాదగిరి, ఎం. సురేశ్, విజయేందర్, విజయనిర్మల పాల్గొన్నారు.

భాగ్యమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి మాజీ ఎమ్మెల్యే కంచర్ల పరామర్శ

మాడ్గులపల్లి, డిసెంబర్ 27: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాతృమూర్తి భాగ్యమ్మ గురువారం మృతి చెందారు. విష యం తెలుసుకున్న నల్లగొండ మాజీ ఎమ్మె ల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి శుక్రవారం మండలంలోని చర్లగూడెం గ్రామానికి వెళ్లి భాగ్యమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నల్లగొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సూది రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వెన్న శ్రవణ్ రెడ్డి, గడ్డం ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ

నల్లగొండ : నల్లగొండలోని 43వ వార్డుకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు సోమా నేతాజీ భార్య రజిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి శుక్రవారం ఆయన నేతాజీ ఇంటికి వెళ్లి పరామర్శించారు. రజిత మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, రజక సంఘం రాష్ట్ర కన్వీనర్ కొండూరు సత్యనారాయణ ఉన్నారు.

ద్వాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

బీఆర్‌ఎస్ నాయకుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పరామర్శ

మాల్, డిసెంబర్ 27 : చింతపల్లి మండలం వింజమూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఇరిగి నాగార్జున శుక్రవారం మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ గ్రామానికి వెళ్లి నాగార్జున మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట దండేటికారు ప్రసాద్, అరెంకంటి రాధాకృష్ణ, జంగయ్య, రమావత్ బిచ్యానాయక్, కోటేశ్, మురళి, విజయ్ ఉన్నారు.

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని పుట్టంగండి గ్రామ మాజీ ఉప సర్పంచ్ జబ్బార్ తల్లి మునావత్ ద్వాలీ శుక్రవారం మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ గ్రామానికి వెళ్లి ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించడంతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు వల్లపురెడ్డి, బొడ్డుపల్లి మహేందర్, యాదగిరి, రాయనబోయిన శ్రీను, రవికుమార్, వెంకట్రావు, భీమా, నార్యనాయక్ తదితరులున్నారు.

పలు కుటుంబాలకు భాస్కర్‌రావు పరామర్శ

మిర్యాలగూడ, డిసెంబర్ 27: 19వ వార్డు కౌన్సిలర్ పత్తిపాటి నవాబ్ సోదరుడు పత్తిపాటి నాగయ్య (65) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పట్టణంలోని ముత్తిరెడ్డికుంటలో ఉన్న ఆయన నివాసానికి వెళ్లి నాగయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఫర్టిలైజర్ బజార్‌కు చెందిన జైని సుశీల(80), గాంధీనగర్‌కు చెందిన కొత్తపల్లి సైదులు(75) మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే వారి ఇండ్లకు వెళ్లి నివాళులర్పించారు. ఆయన వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బైరం సంపత్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ ఇలియాస్‌ఖాన్, మగ్దూమ్‌పాషా, పిన్నబోయిన శ్రీనివాస్‌యాదవ్, బల్లెం అయోధ్య, షోయబ్, జోజి, పునాటి లక్ష్మీనారాయణ, జాస్తి రాంబాబు, అశోక్, శివరాం, చంటి, శరత్, తాళ్లపల్లి రవి ఉన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

- నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

శాలిగౌరారం, డిసెంబర్ 27 : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరునుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట సీఐ కొండల్‌రెడ్డి, ఎస్‌ఐ సైదులు ఉన్నారు.

‘పూల రవీందర్‌కు బహుజన టీచర్ల జేఏసీ మద్దతు ’

సమావేశంలో మాట్లాడుతున్న జాక్టో జిల్లా చైర్మన్ వీరరాఘవులు

రామగిరి, డిసెంబర్ 27: నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పూల రవీందర్‌కు జిల్లా బహుజన టీచర్స్ జేఏసీ మద్దతు ప్రకటించిందని జాక్టో చైర్మన్ కొనకంచి వీరరాఘవులు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో బహుజన టీచర్స్ యూనియన్ల నాయకులు, ఉపాధ్యాయలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జాక్టో సభ్యులు కొంపెల్లి భిక్షపతి, వంగూరు నారాయణయాదవ్, కొన్నె శంకర్‌గౌడ్, సమీర్‌కుమార్, సిరందాసు రామదాసు, ఎండీ అలీమ్, పెండెం శ్రీనివాస్, మేడి రామకృష్ణ పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న యాదవ సంఘం నాయకులు

29న దేవరకొండలో యాదవ సంఘం సమావేశం

చందంపేట(దేవరకొండ), డిసెంబర్ 27 : ఈ నెల 29న దేవరకొండ పట్టణంలోని వైష్ణవి ఫంక్షన్ హాల్లో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి యాదవులు అధిక సంఖ్యలో తరలిరావాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండల్‌యాదవ్ కోరారు. శుక్రవారం దేవరకొండలోని స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన యాదవ సంఘం సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి చందంపేట, నేరేడుగొమ్ము మండలాలకు సంబంధించిన యాదవ సంఘం నాయకులు పాల్గొనాలని, సమావేశంలో రెండు మండలాల కమిటీలను ఎన్నుకోనున్నట్లు చెప్పారు. సమావేశంలో సంఘం నాయకులు శవ్వ నారాయణ, చందంపేట మాజీ ఎంపీపీలు ముత్యాల సర్వయ్య, గోవిందుయాదవ్, మాజీ జడ్పీటీసీ నర్సింహయాదవ్, సింగిల్ విండో చైర్మన్ శ్రీశైలం యాదవ్, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటి, వెంకటేశ్వర్లు, గడ్డం వెంకటయ్య, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.